వరద కాదు.. మల్చింగ్ పరద



నీలిమబ్బులు కమ్మిన ఆకాశం.. పచ్చదనంతో నిండుకున్న గుట్టల చెంత ఈ వరద నీటి ప్రవాహం ఏమిటో అనుకుంటే పొరపడినట్లే. ఆధునిక పద్ధతిలో మిర్చి సేద్యం చేపట్టిన ఓ కర్షకుడు ఏర్పాటు చేసిన మల్చింగ్ పరద. వరద నీటి ప్రవాహం ఉరుకులు పెడుతున్నట్లు ఉన్న ఈ చిత్రాన్ని వెంకటాపురం మండలం రాచపల్లి మార్గంలో 'న్యూస్‌టుడే' తన కెమెరాలో బంధించింది.

– న్యూస్‌టుడే, వెంకటాపురం

కేంద్ర పథకాల అమలుపై పర్యవేక్షణ

మంగపేట, న్యూస్‌టుడే: కేంద్ర పథకాల అమలుపై మంగపేట మండలంలోని పలు గ్రామాల్లో కేంద్రం నుంచి వచ్చిన నేషనల్ లెవెల్ మానిటరింగ్(ఎన్‌ఎల్ఎం) బృందం పర్యవేక్షించింది. మండలంలోని నర్సింహసాగర్, చెరుపల్లి గ్రామ పంచాయతీలను ఎంపిక చేసుకొని కేంద్ర పథకాలు ఎలా అమలవుతున్నాయని పరిశీలించారు. ఇందులో భాగంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్, సెర్ప్ కార్యకలాపాలు, పింఛన్ల గురించి తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో ఎన్‌ఎల్ఎం టీమ్ అధికారి రాజేశ్, జిల్లా అధికారి, ఈజీఎస్ ఏపీడీ వెంకటనారాయణ, సెర్ప్ ఏపీడీ వేణు, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బద్రూ, ఏపీఎం అంకూస్, మండల పంచాయతీ అధికారి శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అద్దె చెల్లింపుల్లో జాప్యం.. గురుకుల పాఠశాలకు తాళం



మల్లంపల్లి గ్రామంలోని ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల

ములుగు, న్యూస్‌టుడే: గురుకుల విద్యాలయాలకు చెల్లించాల్సిన అద్దె బకాయి పేరుకుపోవడంతో.. యజమాని భవనానికి తాళం వేశారు. ఆరు నెలలుగా అద్దె చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ములుగు మండలం మల్లంపల్లి గ్రామంలోని ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతోంది. చెల్లింపులో జాప్యం కారణంగా భవన యజమాని సురేష్ మంగళవారం ఉదయం భవనానికి తాళం వేశారు. దసరా సెలవుల తర్వాత మంగళవారం తిరిగి పాఠశాలలు పునఃప్రారంభం కాగా, మొదటి రోజు విద్యార్థులు రాలేదు. గురుకుల పాఠశాలకు చెందిన ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బంది బయటనే నిరీక్షించాల్సి వచ్చింది.

రూ.21 లక్షలు బకాయి..

మల్లంపల్లిలో నిర్వహిస్తున్న ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల అద్దె భవనానికి ఆరు నెలల బకాయి ఉంది. నెలకు రూ.3.50 లక్షలు అద్దె కాగా, రూ.21 లక్షలు బకాయి పేరుకుపోయింది. భవన యజమాని పలుమార్లు గురుకుల సొసైటీ యాజమాన్యానికి, పాఠశాల ప్రిన్సిపల్‌కు ప్రతి నెల అద్దె చెల్లించాలని కోరుతున్నప్పటికీ.. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో.. విసిగిన ఆయన మంగళవారం తాళం వేశారు.

విద్యార్థులెవరూ రాలేదు..

- అంకయ్య, ప్రిన్సిపల్, ఎస్సీ గురుకుల పాఠశాల, మల్లంపల్లి

సమస్యను జిల్లా పాలనాధికారి టీఎస్. దివాకరను కలిసి వివరించాం. భవన యజమాని సురేష్‌తో మాట్లాడాం. బ్యాంకు ఖాతాలో మధ్యాహ్నం తర్వాత డబ్బులు పడ్డాయని సురేష్ ఫోన్ చేసి చెప్పారు. బుధవారం ఉదయం తాళాలు తీస్తామన్నారు. దసరా సెలవుల తర్వాత పాఠశాల తెరిచిన మొదటి రోజు కావడంతో విద్యార్థులెవరూ రాలేదు.

జిల్లాలో మూడు గురుకుల విద్యాలయాలు

జిల్లా పరిధిలో మూడు గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇందులో ములుగు మండలం మల్లంపల్లిలోని ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల, ములుగులో ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, ములుగు మండలం దేవగిరిపట్నం గ్రామంలోని మైనార్టీ గురుకుల విద్యాలయాలు ఉన్నాయి. ఇందులో మల్లంపల్లిలో కొనసాగుతున్న దానికి మాత్రమే తాళం వేశారు. మిగిలిన పాఠశాలలు యథాతథంగా కొనసాగాయి.

దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాల గడువు పొడిగింపు

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని దూరవిద్య కేంద్రం డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల గడువును పొడిగించినట్లు కేంద్ర సంచాలకులు ఆచార్య వి.రామచంద్రం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అగ్నిమాపక శాఖ సిబ్బందికి నైపుణ్య శిక్షణ



అవగాహన కల్పిస్తూ..

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: కరీంనగర్ మానేరు జలాశయంలో రెండు రోజులపాటు నిర్వహించే అగ్నిమాపక శాఖ జోనల్ స్థాయి నైపుణ్య శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి హాజరైన 70 మంది సిబ్బందికి శిక్షణ అందించారు. కొత్తగా కొనుగోలు చేసిన రిమోట్ కంట్రోల్ లైఫ్ సేవింగ్ బోట్‌పై శిక్షణ, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బుధవారం కరీంనగర్, నిర్మల్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, ఆసిఫాబాద్ జిల్లాల 60 మంది సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా అధికారి భగవాన్‌రెడ్డి పర్యవేక్షించారు.



పిచ్చిమొక్కలు పెరిగి, పూడిక మట్టితో నిండిన ఈ కాలువ వెంకటాపురం-వాజేడు మండలాల సరిహద్దులోని ఆర్.గుంటపల్లి చెంతనే ఉన్న పాలెంవాగు జలాశయం ప్రధాన కాలువ. ఇక్కడి డీఎల్ఆర్‌బీ నిర్మాణం చేపట్టడంతో కాలతీతం, పూర్తయ్య సిమెంట్ గొట్టాల్లో మట్టి పేరుకుపోవడంతో దిగువకు నీరు పారడం లేదు. దీంతో బర్లగూడెం పంచాయతీ పరిధిలోని 3 వేలకుపైగా ఎకరాల్లో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది.



పర్శికగూడెం సమీపంలోని పంటకు నీటిని అందించేందుకు పైపులను పరుస్తున్న రైతులు

కాలువలు అధ్వానం.. సాగు ప్రశ్నార్థకం..!

వెంకటాపురం(ములుగు జిల్లా), న్యూస్‌టుడే: 'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా తయారైంది ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని పాలెంవాగు మధ్యతరహా జలాశయం పరిస్థితి. జలాశయంలో సమృద్ధిగా నీరున్నా సేద్యానికి నీరందని దైన్యస్థితి దాపురించింది. నీటిపారుదల శాఖ ముందుచూపు లేమి, నిర్మాణ పనుల్లో అంతులేని నిర్లక్ష్యం కర్షకుల పాలిట శాపమైంది. కాలువల అధ్వానస్థితితో నీరు పారడం గగనంగా ఉంది. ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారడంతో అన్నదాత గగ్గోలు పెట్టాల్సి వస్తోంది.

అధికారుల నిర్లక్ష్యం

నీటిపారుదలశాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణితో కోట్ల రూపాయల నిర్మాణ పనులకు గ్రహణం పట్టింది. ప్రాజెక్టుకు చెందిన నాలుగు కాలువలు, వెంకటాపురం-వాజేడు మార్గంలోని జెల్లాకాలనీ-ఆర్.గుంటపల్లి మధ్య ప్రధాన కాలువపై డీఎల్‌ఆర్‌బీ, పైపు కల్వర్టులు నిర్మాణాలు మూలుగుతున్నాయి. రూ.10 కోట్లు కేటాయించినా గుత్తేదారు సాకులు చెబుతూ.. కాలం వెల్లదీయగా, ప్రాజెక్టు యంత్రాంగం సైతం వంతపాడిందనే విమర్శలున్నాయి. ఏటా కడగండ్ల పాలవుతున్న ప్రధానమైన సమస్య డీఎల్ఆర్‌బీని సకాలంలో చేపట్టకపోవడంతో మళ్లీ అవే ఇబ్బందులు మొదలయ్యాయి. పిచ్చి మొక్కలు పెరిగి, మట్టి పేరుకుని దిగువకు నీరు పారకపోవడంతో బర్లగూడెం పంచాయతీలోని చిరుతపల్లి, పర్శికగూడెం, రామవరం, మిచ్చిగూడెం, జెల్లాకాలనీ, ఆర్.గుంటపల్లి ప్రాంతాల్లో వరి పొట్టదశలో ఎండుముఖం పట్టగా, మిర్చి సేద్యం ఆలస్యమవుతోంది.

నివేదనలు బుట్టదాఖలేనా..?

సాగునీటి కష్టాలను తీర్చాలని మంత్రి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు రైతులు నివేదించారు. గత నెలలో ఈ ప్రాంతంలో పర్యటించిన ప్రజాప్రతినిధులకు ఏఎన్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నర్సింహామూర్తి ఆధ్వర్యంలో రైతులు కష్టాలను విన్నవించారు. క్షేత్రస్థాయిలో సమస్యను సైతం చూపించారు. ఇన్నాళ్లైనా కాలువ కష్టాలు పరిష్కారానికి నోచుకోకపోవడం, అధికారులు సైతం అలసత్వం ప్రదర్శిస్తుండటంపై కర్షకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఏటా ఇవే ఇబ్బందులు



- కుచ్చింటి సత్యం, బర్లగూడెం

ప్రాజెక్టు కాలువ ఉన్నా ఉపయోగం లేదు. ఏటా ఇవే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాలు ముఖం చాటేయడం, కాలువకు నీరు రాకపోవడంతో మిర్చి సాగు కష్టంగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారులకు గోడు వెళ్లబోసుకున్నా ప్రయోజనం లేదు.

కిలోమీటరు పైపులు పరిచాం..



- పర్శిక సురేశ్, పర్శికగూడెం

నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా.. పొట్టదశలో ఉన్న పంటకు నీరందడం లేదు. ప్రస్తుతం రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగుకు క్షేత్రాన్ని సిద్ధం చేశా. కాలువ నీరు రాకపోవడంతో గ్రామ శివారులోని చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని మళ్లించేందుకు వ్యయభారం పడాల్సి వస్తోంది. కిలోమీటరు దూరం పైపులు పరిచి, ఆయిల్ ఇంజిన్ల ద్వారా నీటిని తరలిస్తున్నాం.

ఆహారం విలువ తెలిసి.. ఆకలి తీర్చి...
వివరాలు 6లో..

ఆర్టీసీ పండగ చేసుకుంది..!



● 14 రోజుల్లో రూ.28.99 కోట్ల ఆదాయం

దసరా ఆర్టీసీకి కలిసొచ్చింది. పెద్ద ఎత్తున ప్రయాణికులను చేరవేసి అదనపు ఆదాయాన్ని సంపాదించుకుంది. గతంలో పండగ సమయంలో ప్రత్యేక ఛార్జీలు వసూలు చేసేవారు. ఈసారి హైదరాబాద్ రూట్‌లో మాత్రమే ప్రత్యేక ఛార్జీలు పెట్టారు. అయినప్పటికీ అంచనా ప్రకారం అనుకున్న ఆదాయం రాబట్టింది. అక్టోబర్ 2 నుంచి పాఠశాలలు, 4 నుంచి కళాశాలలకు సెలవులు ప్రకటించడం, మహాలక్ష్మి పథకం అమల్లోకి రావడంతో మహిళలు ఉచిత ప్రయాణం చేయడం లాంటి కారణాలతో అనుకున్న లక్ష్యం చేరుకుంది..

● వరంగల్ రీజియన్‌లో వరంగల్ 1, వరంగల్ 2, హనుమకొండ, భూపాలపల్లి, పరకాల, జనగామ, మహబూబాబాద్, తొర్రూరు, నర్సంపేట డిపోలు ఉన్నాయి.

● అక్టోబర్ 1 నుంచి 14 వరకు 850 ప్రత్యేక బస్సులు నడిపించారు.

● 14 రోజుల్లో 20 లక్షల నుంచి 25 లక్షల మంది ప్రయాణించారు..

● మొత్తం 50 లక్షల కిలోమీటర్లు తిరిగి రూ.28.99 కోట్ల ఆదాయం సంపాదించారు. గతేడాది 13 రోజుల్లో రూ.19 కోట్ల ఆదాయమే వచ్చింది.

–హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే



హనుమకొండ ప్రధాన బస్టాండులో ప్రయాణికుల రద్దీ

దూర ప్రాంతాలకు

రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి హైదరాబాద్, బెంగళూరు, పుణె, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపించారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని ఎక్కువగా వినియోగించుకున్నారు. పండగకు ముందు మూడు రోజులు, తర్వాత రెండు రోజులు అంతర్రాష్ట్ర సర్వీసుల్లో ఎక్కువ మంది ప్రయాణించారు.

అధికారుల ప్రత్యేక దృష్టి

తిరుగు ప్రయాణంలో భాగంగా ఈ నెల 13, 14 తేదీల్లో ఆర్టీసీ రీజియన్ అధికారులు హైదరాబాద్, ఉప్పల్ ప్రాంతాల్లో ఉండి రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించారు. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన బస్ స్టేషన్లలో డిపో మేనేజర్లు పర్యవేక్షించారు.

డిపోల వారీగా వివరాలు

డిపో	ఆదాయం(రూ.కోట్లలో)	తిరిగిన కి.మీ(లక్షల్లో)	ఓ.ఆర్ (శాతం)
హనుమకొండ	3.73	6.72	81
జనగామ	3.38	6.16	94
వరంగల్ 1	4.67	7.82	83
వరంగల్ 2	3.93	7.16	86
మహబూబాబాద్	2.03	3.46	103
నర్సంపేట	2.84	4.92	96
పరకాల	2.23	3.79	98
తొర్రూరు	3.29	5.52	104
భూపాలపల్లి	2.85	4.75	97

సిబ్బంది, అధికారుల కృషి వల్లే..



- విజయభాను, ఆర్టీసీ రీజనల్ మేనేజర్, వరంగల్ రీజియన్

ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాం. ఆర్టీసీ కార్మికులు, అధికారులు సమష్టి కృషి ఫలితంగా అనుకున్న మేరకు ఆదాయాన్ని తీసుకొచ్చాం. ప్రయాణికులు ఎక్కువగా ఆదరించారు. మరో రెండు రోజుల పాటు రద్దీ కొనసాగనుంది. లోటుపాట్లను సవరించుకొని సేవలు అందిస్తాం.

సభ్యత్వ నమోదులో జిల్లా ముందంజలో ఉండాలి



ప్రసంగిస్తున్న రాష్ట్ర భాజపా సభ్యత్వ నమోదు సహ ప్రముఖ్ గోలి మధుసుదన్‌రెడ్డి

ములుగు, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రతి బూత్‌లో వంద సభ్యత్వాలు నమోదు చేయాలని రాష్ట్ర భాజపా సభ్యత్వ నమోదు సహ ప్రముఖ్ గోలి మధుసుదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ములుగులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో భాజపా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రక్రియ పెద్ద ఎత్తున పండగ వాతావరణంలో జరుగుతుందని, జిల్లాలో కూడా ఇంకా చురుకుగా పాల్గొని నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేసి జిల్లా ముందంజలో ఉండాలన్నారు. ప్రతి ఒక్క నాయకుడు సభ్యత్వ సేకరణ చేయాలని పిలుపునిచ్చారు. నమోదుకు అక్టోబర్ 20 వరకు సమయం ఉందన్నారు. ఇందులో భాగంగా ములుగులో పలువురు వ్యాపారుల నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు సిరికొండ బలరాం, జాతీయ కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపన్న, ములుగు మండల అధ్యక్షుడు గాదం కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి శీలమంతుల రవీంద్రాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగు రవిందర్‌రెడ్డి, నాయకులు జినుకల కృష్ణాకర్‌రావు, భూక్యా జవహర్‌లాల్, రవి రెడ్డి, నగరపు రమేష్, గంగుల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలకమండలి నిర్వహణకు సన్నద్ధమవుతున్నాం..



మాట్లాడుతున్న పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఐటీడీఏ 61వ పాలక మండలి సమావేశ నిర్వహణకు సన్నద్ధమవుతున్నామని పీవో చిత్రామిశ్రా తెలిపారు. మంగళవారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. 20 డిసెంబర్ 2019న 60వ పాలక మండలి సమావేశం జరిగిందని, అప్పటి నుంచి కరోనా, ఇతరత్రా కారణాలతో 61వ పాలక మండలి సమావేశ నిర్వహణలో జాప్యం జరిగిందన్నారు. ఈ దీపావళి పండగలోపే నిర్వహించేందుకు సన్నాహాలు చేశామన్నారు. సంబంధిత ఎజెండా అంశాలు కూడా సిద్ధమయ్యాయని, పాలకుల అనుకూల సమయాన్ని అనుసరించి తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. ఐటీడీఏ గిరిజన సలహా కమిటీని సైతం నియమించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించే ఉద్యోగ నియామకాల క్యాలెండర్‌ను అనుసరించి నిరుద్యోగ గిరిజన యువతకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంకు, పోలీసు తదితర పోటీ పరీక్షలకు వరంగల్ కేంద్రంగా శిక్షణ అందిస్తామన్నారు. గిరిజన నిరుద్యోగులు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎంత మంది ఉన్నారో సమాచారాన్ని సేకరిస్తున్నామని, వీరికి అనుగుణంగా పోటీ పరీక్షలకు శిక్షణ అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.

గుణాత్మక విద్య అందించేందుకు శిక్షణ

గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు శిక్షణ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యా లక్ష్యాలకనుగుణంగా నవీకరించిన పద్ధతుల్లో బోధన చేసి విద్యార్థుల్లో నాణ్యమైన విద్యను పెంపొందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత పోటీని తట్టుకుని ఉన్నత, ఉత్తమ చదువులకు వెళ్లే విధంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఆర్థిక స్వావలంబన పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందించేందుకు నిధుల ఇవ్వాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. త్వరలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో పడిన ఈఎస్ఎస్ పథకం యూనిట్లను లబ్ధిదారులకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గిరివికాస పథకం కింద వేసిన బోర్లు వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ఐటీడీఏలో పలు కీలక శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఉన్నతాధికారులకు నివేదించామని, త్వరలో భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పాఠశాలల కేటాయింపు ప్రక్రియ పూర్తి



పాల్గొన్న జిల్లా విద్యాశాఖ అధికారి జి.పాణిని, కోఆర్డినేటర్లు, ఎంఈవోలు

ములుగు, న్యూస్‌టుడే: ములుగు జిల్లాలో కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు ప్రక్రియ మంగళవారం రాత్రి పూర్తయింది. సాయంత్రం ప్రారంభమైన పాఠశాలల కేటాయింపు ప్రక్రియ రాత్రి 9 గంటల వరకు సాగింది. జిల్లా విద్యాశాఖ అధికారి జి.పాణిని పర్యవేక్షణలో ములుగులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత స్కూలు అసిస్టెంట్లు, ఆ తర్వాత భాషా పండితులు, తర్వాత ఎస్జీటీలకు బదుల కేటాయింపు జరిగింది. మెరిట్ ఆధారంగా ఖాళీలను ఎల్ఈడీ తెరపై చూపించారు. కో-ఆర్డినేటర్లు రాజు, సాంబయ్య, మల్లారెడ్డి, జిల్లాలోని ఎంఈవోలు పాల్గొని కేటాయింపులో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రక్రియను పూర్తి చేశారు. మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రారంభం కావాల్సిన కార్యక్రమం ఉన్నతాధికారుల సూచన మేరకు సాయంత్రం ప్రారంభమైంది. తొలుత ప్రకటించిన తేదీ సమయం ప్రకారం ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఉదయమే ములుగు చేరుకున్నారు.

176 పోస్టుల భర్తీ

జిల్లాలో స్కూలు అసిస్టెంట్లు భాషా పండితులు, ఎస్జీటీలు మొత్తం 192 పోస్టులు ఖాళీ ఉన్నట్లు ప్రకటించారు. డీఎస్సీ నిర్వహణ తర్వాత 176 మంది మాత్రమే ఎంపికయ్యారు. ఇందులో భాషా పండితులు హిందీ-8, తెలుగు-7, స్కూలు అసిస్టెంటు బయోలాజికల్ సైన్స్ 5, ఫిజికల్ సైన్స్-1, గణితం-3, తెలుగు-3, ఇంగ్లీషు-5, హిందీ-3, సోషల్-9, స్పెషల్ ఎడ్యుకేషన్-3, ఫిజికల్ డైరెక్టర్-1, పీఈటీ-1, ఎస్జీటీ 122, ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్-5 పోస్టులకు ఎంపికైన వారికి పాఠశాలల కేటాయింపు జరిగింది.



కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు

ఆహారం విలువ తెలిసి.. ఆకలి తీర్చి..

నేడు ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం



ఒకవైపు ఆకలితో అలమటించేవారు.. మరోవైపు ఆహారం ఎక్కువై వృథా చేస్తున్నవారు మనకు కనిపిస్తుంటారు. ప్రతి మెతుకు నిరుపేదలు, అనాథల కడుపు నింపితే అంతకంటే మేలు మరొకటి ఉండదు. ఈ నిజాన్ని గుర్తించి ఆహారం వృథా కాకుండా అన్నదానం రూపంలో పేదలకు అందజేస్తున్న వారెందరో ఉన్నారు. బుధవారం ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని నేటి కాలంలో ఆహారం ఎంత విలువైందో.. దాన్ని వృథా చేయకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

కాజీపేట, శివనగర్, న్యూస్‌టుడే

ఆ బాధ తెలుసు కాబట్టే..

- రాందేని ధనలక్ష్మి, శ్రీనివాస్, హనుమకొండ



మా బాబు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స కోసం ఐదునెలలు ఉన్నప్పుడు ఆకలి బాధ తెలిసింది. ప్రతి రోజు ఆహారం పంపిణీ చేసే స్వచ్ఛంద సంస్థలను చూసేవాళ్లం. వారి దాతృత్వం చూశాక ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించాలనిపించింది. ఈ ఆలోచన కరోనా సమయంలో రాగా గురుదక్షిణ నిత్యాన్నదాన సొసైటీ ఏర్పాటు చేసి వరంగల్, హనుమకొండ, కాజీపేట రైల్వే, బస్టాండ్లు, ఫుట్‌పాత్‌లపై ఉండే అనాథలు, మానసిక ఇబ్బందులతో ఉన్న వారికి అన్నదానం చేస్తున్నాం.

లక్షన్నర మందికి

- కొండమీది రాజన్ బాబు, ఉర్సు, వరంగల్

కరోనా సమయంలో ఆకలితో బాధపడుతున్న అనాథలకు అన్నదానం చేయడంతో మొదలైన నా సేవ కన్నతల్లి ఫౌండేషన్ ఏర్పాటుకు దారితీసింది. సంస్థ ద్వారా శుభకార్యాలు, ఫంక్షన్ హాళ్లలో, మిగిలిన ఆహారం సేకరించి శంభునిపేట, వరంగల్ బస్టాండ్, రైల్వేస్టేషన్, వరంగల్ చౌరస్తా, ఎంజీఎం ఆసుపత్రిలో అన్నదానం చేస్తున్నాను. మిగిలిన భోజనం ఇస్తే మా సంస్థ ద్వారా ప్లేట్లు, గ్లాసులు, తాగునీరు తీసుకెళ్లి అన్నదానం చేస్తున్నాం. ఇప్పటికి లక్షన్నర మందికి అన్నదానం చేశాం.

● ఆహారం మిగిలితే 97017 51278 నెంబరుకు తెలియజేయాలి.



మీకు తెలుసా..

మన ఆహార అలవాట్లు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) నివేదిక పేర్కొంది. వృథా చేయకుండా పర్యావరణ హితంగా ఆహారం తీసుకోవడం వల్ల మన దేశం ఆహార ఉత్పత్తికి ఇతర దేశాలకంటే తక్కువ భూభాగం వాడుతున్నామని చెప్పింది. జనాభా ఎక్కువగా ఉన్నా కేవలం 0.8 శాతం భూమిని మాత్రమే వాడుతున్నాం. చైనా 1.7 శాతం, జపాన్ 1.8, అర్జెంటీనా 7.4 ఆస్ట్రేలియా 6.8, అమెరికా 5.5 శాతం వాడుతున్నాయని నివేదిక తెలిపింది. ● ఉమ్మడి వరంగల్ జిల్లా ఇతర జిల్లాలతో పోలిస్తే ఆహార ఉత్పత్తికి 0.75 శాతం వినియోగిస్తోందని వ్యవసాయ శాఖ తెలిపింది.



పల్లగుట్ట ఉన్నత పాఠశాలలో తిథి భోజనం.. పాఠశాల పరిధిలో ఎవరైనా విద్యార్థులకు ఇలా ఆహారం అందజేస్తారు



లెక్క పెట్టి మరీ..

అమెరికాలాంటి దేశాల్లో శుభకార్యాలు చేయడానికి, ఆహ్వానంతో పాటు గూగుల్ ఫారం కూడా పంపుతారు. ఆన్‌లైన్‌లో శుభకార్యానికి వస్తున్నారా లేదా.. వస్తే ఎంత మంది వస్తారు అనే విషయాన్ని అందులో పొందుపరచాలి. దీన్ని బట్టి వంటలు తయారు చేస్తారు. దీంతో ఆహారం వృథా కాదు. ఇటీవల ఎన్ఐటీ ఆచార్యుడు సి.ప్రసాదు తన కుమారుడి వివాహానికి ఇలాగే ఆన్‌లైన్ ఫారం పంపి దానికి తగినట్లుగా వంటలు చేయించారు.

ఇతర దేశాల్లో..

● ఫ్రాన్స్‌లో మిగిలిపోయిన కూరగాయలు కూడా బయటపడేస్తే నేరంగా భావిస్తారు. వాటిని పేదలకు ఇవ్వాలి. ● నార్వే ఆహార పదార్థాలపై బెస్ట్ బిఫోర్ యూస్ అని ప్రింట్ చేస్తుంది. ఇటలీ, ఫ్రాన్స్, చైనా, అమెరికాలోనూ ఇలాంటి చట్టాలు న్నాయి.

అవును.. నిజమే!

● ప్రతిరోజు వరంగల్ మహా నగరపాలక సంస్థ సేకరిస్తున్న వ్యర్థాల్లో సుమారు 40 టన్నులు ఆహార వ్యర్థాలే ఉంటున్నాయని అధికారులు చెబుతున్నారు. ● దేశంలో పోషకాహార లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య 14 శాతం ఉంది. వృథా ఆహారం వారికి అందేలా చేయడం ద్వారా వారి శాతం తగ్గించొచ్చు. ● కుళ్లిన ఆహార పదార్థాలను చెత్తకు తరలించడం వల్ల కార్బన్ డై ఆక్సైడ్ కంటే 80 రెట్లు ఎక్కువ శక్తివంతమైన గ్రీన్‌హౌస్ వాయువైన మీథేన్ విడుదలవుతోందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకుందాం

● బంగాళదుంపలు, టమాటాలు, ఉల్లిపాయలు, వెల్లుల్లి, దోసకాయలు ఫ్రిజ్‌లో కాకుండా గది ఉష్ణోగ్రతలోనే నిల్వచేయాలి.
● ఆకుకూర కాడలను నీటిలో ఉంచడం ద్వారా నిల్వ చేసుకోవచ్చు.
● బ్రెడ్ గడువులోగా వాడేయలేమని భావిస్తే ఫ్రిజ్‌లో నిల్వచేయాలి.
● దుకాణం నుంచి ఆహార పదార్థాలను కొనుగోలు చేసే సమయంలో వాటి నిల్వ కాలం చూసుకొని తెచ్చుకోవాలి.
● తరచూ ఆహారం మిగులుతుంటే దాన్ని ఫ్రిజ్‌లో పెట్టి ఒక రోజు వాటిని ఉపయోగించేలా ప్రణాళిక వేసుకోవాలి
● పెరటిలోని కూరగాయల మొక్కలకు కంపోస్టు ఎరువుగా వేయడం ద్వారా ఆహార వృథా నివారించవచ్చు.
● ఇంట్లో ఉన్నవారి ఆహార అవసరాన్ని గుర్తించి తయారు చేసుకోవడం, అవసరమైనప్పుడే తయారు చేసుకోవడం వంటి చిట్కాల ద్వారా తగ్గించవచ్చు.
● అదనంగా ఉన్న ఆహారాన్ని దగ్గరి వారికి, పక్క వారికి పంచడం, ఆశ్రమాలకు, అనాథలకు ఇవ్వడం చేయాలి.
● ఆహార బ్యాంకులను ఏర్పాటు చేసి అందులో వేయడం ద్వారా అవసరమైన వారు తీసుకునేలా ఏర్పాట్లు చేయడం.
● ఆహార వ్యర్థాలను తగ్గించడానికి హోటళ్లు, గృహ యజమానులకు ప్రోత్సాహకాలు అందించడం చేయాలి.

పదిహేను సంవత్సరాలుగా

- ఆరుట్ల శ్రీనివాస్, సాయి అమృతహస్తం సంస్థ, వరంగల్

15 ఏళ్ల కిందట గురుపౌర్ణమి నాడు అన్నదానంతో మిగిలిన ఆహారాన్ని అనాథలకు పంపిణీతో మొదలైన నా సేవ ఇప్పటికీ కొనసాగిస్తున్నా. సాయి అమృత హస్తం పేరుతో మిత్రులు పోలా మహేష్, ఎరుకుల్ల నాగేశ్వర్‌రావు, పబ్బ కిషోర్, వేముల శ్రీనివాస్‌తో కలసి కల్యాణమండపాలు, హోటళ్లు, క్యాటరింగ్ సర్వీసు సెంటర్లలో మా సంస్థ గోడపత్రికలు వేసి, మిగిలిన ఆహారాన్ని మాకు అందించేలా చేస్తున్నాం. అలా నెలలో నాలుగు సార్లు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పంపిణీ చేస్తున్నాం.



ఇంటి ఆహారంలోనే..

- డాక్టర్ యాట రోహిత్‌రెడ్డి, వడ్డెపల్లి



ఇంటి ఆహారంలో తాజాదనం ఉంటుంది. ఎక్కువగా నూనెలు వాడకుండా ఉడికించి తింటాం కాబట్టి అందులోని లవణాలు, విటమిన్లు పాడవకుండా ఉంటాయి. వృథా కూడా తక్కువే.. బయటి హోటల్ యజమానులు అమ్ముడు పోని కూరగాయలు వాడుతారు కాబట్టి తాజాదనం తగ్గుతుంది.

నాలుగేళ్లుగా అన్నదానం

- నార్లపురం రాజు



మాది జనగామ జిల్లా పాలకుర్తి. చదువుకోడానికి హనుమకొండకు వచ్చాక ఇక్కడ ఆకలి బాధ తెలిసింది. అడ్వాన్స్‌డ్ లైఫ్ ఫౌండేషన్ సంస్థను ఏర్పాటుచేసి, దాని ద్వారా ఆహారాన్ని ఫంక్షన్ హాళ్ల నుంచి సేకరించి నాలుగేళ్లుగా అనాథలు, ఆశ్రమాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పంపిణీ చేస్తున్నాను.

ఇలా చేస్తే మేలు..

కార్పొరేషన్ ఆధ్వర్యంలో వృథా ఆహారాన్ని పేదలకు అందించే వ్యవస్థ ఏర్పాటుచేసి ఒక హెల్ప్‌లైన్ నెంబరు ఏర్పాటు చేయాలి. వరంగల్ హెల్పింగ్ హ్యాండ్ ఛాలెంజ్, సహారా ఫౌండేషన్ సంస్థలు సామాజిక మాధ్యమాల ద్వారా వృథా ఆహారాన్ని సేకరించి అనాథలకు పంచుతున్నాయి. శుభకార్యాల్లో మిగిలిన ఆహారం తీసుకోవడానికి సహృదయ ఆశ్రమం, సాయి అనాథ సేవా ట్రస్టు, ఆరోగ్య సామాజిక సేవా సంస్థ, డాన్‌బాస్కో శివనగర్, హౌజ్ ఆఫ్ జాయ్ ఉంటాయి..

ప్రజల్లో అవగాహన పెరిగింది..

- ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, వరంగల్



ఆహార పదార్థాల వినియోగంపై వరంగల్ ప్రజల్లో అవగాహన పెరుగుతుంది. ఆచితూచి కొనుగోలు చేస్తున్నారు. కొన్ని చోట్ల మోసాలు జరుగుతున్నాయి. తాము గమనించి కేసులు నమోదు చేస్తున్నాం.

అంకెల్లో వివరాలు..

వరంగల్‌లో ఆహారం వృథా : 18 శాతం

ఇందులో శుభకార్యాల్లో 10

ఇంటిలో..	1
హాస్టళ్లలో..	2
హోటళ్లలో	3
ఇతర	2



రాయితీ రుణం ఇప్పిస్తామని టోకరా

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి రాయితీ రుణం ఇప్పిస్తామని నమ్మించి ఒకరు టోకరా వేసిన ఘటనపై ఆలస్యంగా కేసు నమోదు అయింది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెరకు చెందిన కొక్కు తిరుపతి చరవాణికి ఈ ఏడాది ఏప్రిల్ 2న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశారు. మీకు ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం రుణం రూ.10 లక్షలు మంజూరైందని ఒకసారి, రుణం ఇప్పిస్తానని ఒకసారి చెప్పారు. కొంత డబ్బు చెల్లిస్తే రుణం త్వరగా మీ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని నమ్మించారు. రుణం వస్తుందని ఆశపడిన తిరుపతి గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన ఖాతాకు పలు దఫాలుగా రూ.98,530 ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేశారు. కొద్ది రోజులకు ఆ నెంబరుకు ఫోన్ చేసి ఇంకా రుణం రాలేదని అడగ్గా.. కొంత సమయం పడుతుందని సమాధానం ఇచ్చారు. నెలలు గడిచినా రుణం మంజూరు కాకపోవడంతో అవతలి వ్యక్తికి ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ అని వచ్చింది. మోసపోయానని గ్రహించిన బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

161 క్వింటాళ్ల రాయితీ బియ్యం పట్టివేత



బియ్యం స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందిచాల్సిన రాయితీ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన కేంద్రాలపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మొత్తం రూ.4.19 లక్షల విలువచేసే 161 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు.. పరకాలకు చెందిన బి.రఘు, ఎస్.ఉప్పలయ్య కలిసి పరకాల చుట్టుపక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు రాయితీ బియ్యం కొనుగోలు చేసి జ్యోతి రైస్ మిల్లులో నిలువ ఉంచారు. తనిఖీలు నిర్వహించగా సుమారు రూ. 2.63 లక్షల విలువ చేసే 101 క్వింటాళ్ల బియ్యం లభించాయి. నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన ఓదేలు రూ.1.17 లక్షల విలువ చేసే 45 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తూ పట్టుబడ్డారు. నడికూడ మండలం బుడిగజంగాల గ్రామానికి చెందిన తూర్పాటి ఐలయ్య ఇంట్లో రూ. 39 వేల విలువ చేసే 15 క్వింటాళ్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు, ఆరెస్సై భానుప్రకాశ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సు ప్రావిజనల్ మెరిట్ జాబితా విడుదల

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: జిల్లా వైద్యారోగ్యశాఖలో గతంలో ఇచ్చిన స్టాఫ్‌నర్సుల నియామక ప్రకటనకు స్పందించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రావిజనల్ మెరిట్ జాబితాను డీఎంహెచ్‌ఓ, జిల్లా కలెక్టర్ కార్యాలయం నోటీసు బోర్డులో ప్రదర్శనకు పెట్టినట్లు డీఎంహెచ్‌ఓ డా.వెంకటరమణ తెలిపారు. జాబితాలోని సమాచారంపై అభ్యంతరాలుంటే ఈ నెల 16, 17 తేదీల్లో సాయంత్రం 5 గంటల్లోగా అందజేయాలని కోరారు. ప్రావిజనల్ మెరిట్ జాబితా కోసం అధికారిక వెబ్‌సైట్ http:///waranagl.telanagana.gov.in చూడాలని సూచించారు.

చెరువు శిఖం.. కబ్జాల పర్వం

● హైడ్రా తరహా ఏర్పాటే శరణ్యం..





ధర్మసాగర్ రిజర్వాయర్‌లో మొరం పోసి చదును చేసిన భూమి

ధర్మసాగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసి హైదరాబాద్ నగరంలోని చెరువుల్లో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతోంది. ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తూ అక్రమ నిర్మాణాలను తొలగిస్తోంది. అలాంటి వ్యవస్థే హనుమకొండ నగరంలోనూ అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగరం చుట్టుపక్కల చెరువు శిఖం భూమి కనిపిస్తే చాలు హద్దులు పాతుతున్నారు. ధర్మసాగర్ మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంకు లెవల్) గుర్తించి, హద్దులు ఏర్పాటు చేయడంలో నీటి పారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీన్ని అక్రమార్కులు అవకాశంగా తీసుకుని యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. కొందరు చెరువు శిఖంలో మొరం పోస్తూ సొంతం చేసుకుంటున్నారు. ఆయా గ్రామాల రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం.

● ధర్మసాగర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన భూమిని ఓ రైతు పట్టా చేసుకుని అందులోని రెండెకరాలను రూ.80 లక్షల చొప్పున ఆరు నెలల కిందట విక్రయించారు. రిజర్వాయర్ చుట్టూ 15 నుంచి 20 ఎకరాల వరకు సమీప రైతులు కొందరు పట్టా చేసుకున్నారు. మరికొందరు ముంపునకు గురైన భూముల్లో మట్టి, మొరం పోసి ఎత్తు పెంచుకొని సాగు చేసుకుంటున్నారు.

● ఎలుకుర్తిలోని సర్వే నెంబర్ 141లో మర్రిచెరువు 40.33 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీని శిఖం ఇప్పటికే 10 ఎకరాల వరకు కబ్జా అయినట్లు సమీప రైతులు ఆరోపిస్తున్నారు.



శాయిపేట పాత చెరువులో పోసిన మొరం

● పెద్దపెండ్యాలలో మూడేళ్ల కిందట ఓ రైతు కట్టను తొలగించి చెరువు భూమిని తన పొలంలో కలుపుకొనే ప్రయత్నం చేశారు. ఇదే గ్రామంలో మరో చెరువు మత్తడి పోసే చోట మట్టి పోసి నీరు రాకుండా చేశారు.

● శాయిపేట పాత చెరువులో భూమి తన పట్టా స్థలమంటూ మూడేళ్ల కిందట ఓ రైతు చెరువు కట్టను తొలగించి, మొరం పోయించారు. మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు దాన్ని అడ్డుకున్నారు. ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదు. మొరాన్ని తొలగించలేదు. దీంతో వర్షం నీరు, దేవాదుల పైప్‌లైన్ నీరు చెరువులోకి వచ్చినా కిందకు వెళ్లిపోతున్నాయి.

● జానకీపురం, కేశవనగర్, క్యాతంపల్లిలో కుంటలు కబ్జాకు గురవుతున్నాయి.

హద్దులను నిర్ణయిస్తాం..

- సదానందం, తహసీల్దార్, ధర్మసాగర్

నీటి పారుదల, రెవెన్యూ శాఖల సమన్వయంతో మండలంలోని అన్ని చెరువులు, కుంటలకు హద్దులను నిర్ణయించి, సంరక్షణ చర్యలు చేపడతాం. నీటి పారుదల శాఖ అధికారులు ఎఫ్‌టీఎల్‌ను నిర్ణయిస్తే. . సర్వే చేసి ఆయా సర్వే నెంబర్లకు నాలా కన్వర్షన్లు ఇవ్వకుండా, అక్రమ పట్టా చేసుకోకుండా తగిన చర్యలు చేపడతాం.

మల్లన్న హుండీ ఆదాయం రూ.46 లక్షలు

ఐనవోలు, న్యూస్‌టుడే: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయం లెక్కించారు. ఈ ఏడాది జులై 16 నుంచి అక్టోబర్ 15 వరకు 18 హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని మహబూబాబాద్ శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ పరిశీలకులు ఎ.అనీల్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. హుండీల ద్వారా రూ.20,73,376, వివిధ సేవల టికెట్ల ద్వారా రూ.25,35,820 కలిపి మొత్తం రూ.46,09,196 ఆదాయం వచ్చినట్లు ఈవో నాగేశ్వర్‌రావు తెలిపారు. బంగారం, వెండి, విదేశీ డాలర్లను తిరిగి హుండీలో వేశారు. మూడేళ్లుగా ఆలయ ఆదాయం గణనీయంగా పెరుగుతూ వస్తోందని ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, ఆర్ఐ మల్లయ్య, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

చరిత్ర తెలుసుకోండి.. వాలంటీర్లుగా నిలవండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ములుగు పాలనాధికారి దివాకర, ఇంటాక్ కన్వీనర్ పాండురంగారావు తదితరులు



శిబిరానికి హాజరైన వాలంటీర్ల బృందంతో అధికారులు


వెంకటాపూర్, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో వచ్చే ప్రతి అవకాశం భవిష్యత్తులో పునాదికి నాంది అని ములుగు జిల్లా పాలనాధికారి టీఎస్ దివాకర అన్నారు. మూడో విడత శిక్షణ శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరూ చరిత్రను తెలుసుకుని చక్కటి వాలంటీర్‌గా నిలవాలని కోరారు. అక్టోబర్ 15 నుంచి 26 వరకు యునెస్కో గుర్తింపు పొందిన రామప్పలో జరిగే వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ మూడో శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావుతో కలిసి ప్రారంభించారు. ఐకోమాస్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, తెలంగాణ టూరిజం, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు భాగస్వామ్యంతో ప్రారంభమైన శిబిరంలో 80 మంది వాలంటీర్లనుద్దేశించి ఆయన మాట్లాడారు. చరిత్ర, కళలు, పురావస్తు, ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజినీరు, టూరిజం విభాగాల్లో నైపుణ్యం కలిగిన ప్రొఫెసర్లు చెప్పే తరగతులను అర్థం చేసుకుని క్షేత్రస్థాయిలో తెలుసుకుని సేవ చేయడానికి ఇదొక అరుదైన అవకాశమన్నారు. రాబోయే రోజుల్లో టూరిజం ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని, ఇప్పటి నుంచి అవగాహన పెంచుకుంటే భవిష్యత్తు మీదే అన్నారు. కాకతీయుల ఖ్యాతి ఖండాంతరాలు దాటిందని, దానిని తెలుసుకుని విస్తరించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. సమయం వృథా చేయకుండా.. ప్రతిభ చూపి కాకతీయ ప్రాశస్త్యాన్ని చాటాలని కోరారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఇంటాక్ సూచనలు చేసింది. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి శివాజీ, టూరిజం ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్, ఇంటాక్ సభ్యుడు శ్రీధర్‌రావు, అధ్యాపకురాలు శ్రీలత, యోగా గురువు రాంబాబు, ఎంపీడీవో రాజు, పర్యాటక, పురావస్తు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	126
రిటైల్:	148
డ్రెస్డ్:	215
స్కిన్‌లెస్:	244



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, సమ్మారావు, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, మరో చిత్రంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి,

నూకల నరేష్‌రెడ్డికి నేతల నివాళి

మరిపెడ, న్యూస్‌టుడే: దివంగత కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పురుషోత్తమాయగూడెంకు చెందిన నూకల నరేష్‌రెడ్డి దశదినకర్మ మంగళవారం గ్రామంలోని ఏరువాక వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. పలువురు హాజరై ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, శాసనసభ్యులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజకీయ జీవితంతో నరేష్‌రెడ్డితో తమకు ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు.



నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు, రఘురాంరెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దయాకర్‌రావు, రావుల శ్రీధర్‌రెడ్డి, బండాప్రకాష్

మట్టి కుప్పల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన



ములుగు టౌన్, న్యూస్‌టుడే: ములుగు పట్టణంలోని గడిగడ్డ కాలనీలో సీసీ రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఓ ఇంటి నిర్మాణం జరుగుతున్న సమయంలో మూడు నెలల క్రితం రోడ్డుపై మట్టిపోశారు. నెలలు గడుస్తున్నా.. తొలగించకపోవడంతో రవాణాకు ఇబ్బందిగా మారింది. ఈ సమస్యపై మంగళవారం 'ఈనాడు'లో 'మట్టికుప్పలు.. రాకపోకలకు తిప్పలు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి బుల్‌డోజర్, సిబ్బందిని సమకూర్చి మట్టిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

'ఇందిరమ్మ కమిటీలు రాజ్యాంగ విరుద్ధం'

మంగపేట, న్యూస్‌టుడే: ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఇందిరమ్మ కమిటీల ఎంపికలు రాజ్యాంగ విరుద్ధమని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) మండల అధ్యక్షుడు ముత్యాలరావు అన్నారు. మంగళవారం మంగపేటలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదవ షెడ్యూల్ భూభాగంలో 1/70, 1/59, పీసా చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. ఇటీవల ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం పంచాయతీ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని ఇచ్చిన జీవో 33 ఏజెన్సీ ప్రాంతంలో చెల్లదన్నారు. తక్షణమే ఆ జీవోను ఏజెన్సీ ప్రాంతానికి వర్తించకుండా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపిక పెసా కమిటీ ద్వారా జరగాలన్నారు. ఏజెన్సీ చట్టాలను అమలు చేయకపోతే న్యాయపరమైన పోరాటంతో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

అతివల ఆరోగ్యానికి 'మహిళా క్లినిక్'



వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారిణి స్నేహ

వెంకటాపురం, న్యూస్‌టుడే: అతివల్లో వ్యాపిస్తున్న రుగ్మతలను ఆదిలోనే నియంత్రించి భరోసా కల్పించడమే మహిళా క్లినిక్‌ లక్ష్యమని వైద్యాధికారిణి స్నేహ అన్నారు. వెంకటాపురం పట్టణంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో మంగళవారం మహిళా క్లినిక్‌ను నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన అతివలు ఈ శిబిరానికి రావడంతో సేవలందించారు. రక్తనమూనాలు సేకరించి పరీక్షించారు. వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండలంలోని వీరభద్రవరం, నూగూరు, మంగవాయి, రాచపల్లి, శివాపురం గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలందించారు. అసంక్రమిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ శిబిరాల్లో వైద్యులు సోహెల్, ఆశిక్, వినయ్, పవన్, ఎంఎల్‌హెచ్‌పీ మనోహర్, వైద్య సిబ్బంది సేవలందించారు.

మేమున్నాం... మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140
ఏటూరునాగారం: 9440194979, వెంకటాపూర్: 8008624242

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండలంలోని నర్సింగాపురం గ్రామంలో అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టడం లేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - **మల్లెబోయిన సందీప్, నర్సింగాపురం**

సమస్య మా దృష్టిలో ఉంది. గ్రామంలోని నాలుగు అంతర్గత రోడ్లను అభివృద్ధి చేసేందుకు రూ.60 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. - **జక్కవతిరావు, ఏఈఈ, పంచాయతీరాజ్‌శాఖ**

మోడల్ స్కూలు ప్రిన్సిపల్‌గా దేవకి



ములుగు, న్యూస్‌టుడే: ములుగు మండలం బండారుపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌గా సింగారం దేవకి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు శ్రీనివాసాచారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవకి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ప్రిన్సిపల్ శోభారాణి బదిలీపై వెళ్లారు.

పశువులకు టీకాలు వేయించాలి



తాడ్వాయిలో..

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండలంలోని రైతులందరూ తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్య సహాయకుడు రాజు పేర్కొన్నారు. తాడ్వాయి మండల కేంద్రంతో పాటు ఇందిరానగర్‌లో మంగళవారం పశువులకు టీకాలు వేశారు. ఈ నెల 16న నర్సింగాపురం, 17, 18న కామారం, 19న కొండపర్తి, 21న అల్వాల, 22న ఒడ్డుగూడెం, 23న కొడిశాల, 24న లింగాల, 25న బోటి లింగాల, 26న పోచాపూర్, 28న బందాల, 29న బొల్లెపల్లి, 30న అల్లిగూడెం, నవంబరు 1న నర్సాపూర్(పీఎల్), 2న బంజర ఎల్లాపూర్, 4న గంగారం, 5, 6న కాటాపూర్, 7న దామెరవాయి, 8న నర్సాపూర్(పీఏ), 9న అంకంపల్లి, 11న కామారం(పీఏ), 12న ఆశన్నగూడెం ఎల్లాపూర్, 13న బీరెల్లి, 14న వీరాపురంలో టీకాలు వేయనున్నట్లు రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు తమ పశువులను ఇళ్ల వద్దే ఉంచి పశువైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు.

విషజ్వరాలతో నెలకొన్న విషాదం



సమ్మయ్య(పాతచిత్రం)



సారయ్య(పాతచిత్రం)

ములుగు టౌన్, న్యూస్‌టుడే: జ్వరంతో ఇద్దరు మృతిచెందిన సంఘటన జిల్లా పరిధిలో చోటు చేసుకుంది. ఇద్దరి మృతితో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న సిరిబోయిన సమ్మయ్య(50) జ్వరంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తోటి ఉద్యోగులు తెలిపారు. ములుగు మండలం జంగాలపల్లికి చెందిన సమ్మయ్య వరంగల్-2 డిపోలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆరు రోజుల క్రితం డ్యూటీపై విశాఖపట్నం వెళ్లాడు. అక్కడే జ్వరం రాగా, హనుమకొండకు వచ్చిన తర్వాత ఓ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

● ములుగు పట్టణంలోని సఫాయివాడకు చెందిన ఎంపెల్లి సారయ్య(60) గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ములుగు ఏరియా ఆసుపత్రిలో చూపించుకుని మందులు వాడుతున్నాడు. మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఏరియా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతి చెందారు.

అక్రమ వసూళ్లపై పోలీసుల కొరడా

ఇద్దరిపై కేసు నమోదు

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణికుల ప్రాంగణంలోని దుకాణదారుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడిన వ్యవహారంపై పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై కొప్పుల తిరుపతిరావు మంగళవారం ప్రకటించారు. ఆర్టీసీ ద్వారా నిర్వహిస్తున్న ఇక్కడి దుకాణదారులను వెంకటాపురానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆ దుకాణాలు మావే అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. కొంత కాలంగా ఆర్టీసీకి అద్దె చెల్లించకుండా ఆ సొమ్మును యజమానుల వద్ద నుంచి వసూలు చేశారు. ఇటీవల భద్రాచలం ఆర్టీసీ డిపో అధికారులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు. ఈ మేరకు మడప నిఖిల్, కిరణ్‌కుమార్ వర్మలు కొంత కాలంగా దుకాణదారుల నుంచి సుమారు రూ.2.43 లక్షల వసూళ్లకు పాల్పడినట్లు తేలిందన్నారు. ఆర్టీసీ అధికారులు టెండరు నిర్వహించి గిరిజనులకు దుకాణాలను అప్పగిస్తే అందుకు విరుద్ధంగా వ్యవహరించడంతో పాటు బెదిరింపు సొమ్ములు వసూలుకు ఒడిగట్టినట్లు పోలీసులు నిర్ధారించారు. దీంతో మడప నిఖిల్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఈ వ్యవహారంలో భాగస్వామి అయిన మరో వ్యక్తి కిరణ్‌కుమార్‌వర్మ పరారీలో ఉన్నాడని, అతడి కోసం వెతుకుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఖజానాను కాజేసేందుకు అడ్డదారులు తొక్కితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



స్టాపర్ బోర్డులను ఏర్పాటు చేయిస్తున్న ఎస్సై హరీశ్

వాజేడు, న్యూస్‌టుడే: జాతీయ రహదారిలోని జగన్నాధపురం-వాజేడు అడ్డరోడ్డులో నిత్యం జరుగుతున్న ప్రమాదాల నివారణకు వాజేడు ఎస్సై హరీశ్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిలో ఇరువైపులా స్టాపర్ బోర్డుల ఏర్పాటును చేపట్టారు. దసరా పండగ రోజున ఛత్తీస్‌గఢ్ వెళ్తున్న కారు, ట్రాక్టరును ఢీకొట్టిన సంఘటనలో ట్రాక్టరు రెండు భాగాలుగా విడిపోయింది. ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. అదేమాదిరిగా ఛత్తీస్‌గఢ్ వెళ్తున్న ఓ వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. జాతీయరహదారి పక్కన పార్కింగ్ చేసిన ఆటోపైకి లారీ దూసుకెళ్లింది. ఇదే కూడలిలో గతంలో కంటెయినర్ లారీ ఢీకొట్టడంతో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహం ధ్వంసమైంది. ఈ కూడలిలో నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఎస్సై హరీశ్ ఆధ్వర్యంలో జాతీయ రహదారికి ఇరువైపులా మంగళవారం స్టాపర్ బోర్డులను ఏర్పాటు చేయించారు.

'ఇసుక లారీలకు ప్రవేశ రుసుం లేదు'

కాళేశ్వరం, న్యూస్‌టుడే: మండలంలోని మద్దులపల్లి పంచాయతీ పరిధిలోని ఇసుక రీచ్‌లకు వచ్చే లారీలకు ఎటువంటి ప్రవేశ రుసుం తీసుకోవడం లేదని గ్రామ పంచాయతీ ప్రకటించింది. పంచాయతీ పేరు చెప్పి ప్రవేశ రుసుం వసూలు చేస్తున్నారని ఆరోపణలు రావడంతో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి స్వాతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక నింపుకొనే లారీలు నేరుగా రీచ్‌ల వద్దకు వెళ్లే వీలుందన్నారు. రుసుం పేరుతో ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే పంచాయతీ చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కార్యదర్శి తెలిపారు.

సమస్యలపై మధ్యవర్తులను ఆశ్రయించొద్దు



గ్రామసభలో అవగాహన కల్పిస్తున్న సీఐ శంకర్

ములుగు రూరల్, న్యూస్‌టుడే: సమస్యలపై ప్రజలు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని, మధ్యవర్తులను ఆశ్రయించొద్దని ములుగు సీఐ శంకర్ అన్నారు. జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు ములుగు మండలం కన్నాయిగూడెం, అంకన్నగూడెం గ్రామాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ హాజరై మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమస్యలు, పరిష్కారం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్‌రావు, గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య



రాజేందర్(పాతచిత్రం)

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: వేర్వేరు సందర్భాల్లో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లా పరిధిలో జరిగింది. ఏటూరునాగారం మండలంలోని మానసపల్లికి చెందిన జగజెంపుల రాజేందర్(23) అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై షేక్.తాజుద్దీన్ తెలిపారు. మానసపల్లికి చెందిన జగజెంపుల లక్ష్మయ్య భార్య కొన్నేళ్ల కిందట మృతి చెందగా, తన ఒక్కగానొక్క కొడుకును తన అన్న అనురాగ్ వద్ద ఉంచి పని నిమిత్తం పొరుగు రాష్ట్రానికి వెళ్లాడు. స్కూటర్ మెకానిక్ పని నేర్చుకుంటూ మద్యానికి అలవాటు పడ్డాడు. ఈ నెల 12న మధ్యాహ్నం మద్యం మత్తులో ఇంటి వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఇంటి పక్కనున్న వారు గమనించి అనురాగ్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే సామాజిక ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో.. వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ.. మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై పేర్కొన్నారు.

☛ ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన రాచకొండ మల్లయ్య(65) అనే వృద్ధుడు మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. మల్లయ్య భార్య 20 ఏళ్ల క్రితం మృతి చెందారు. కొడుకు రామకృష్ణ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. రామన్నగూడెంలోని బిడ్డ ఉషారాణి వద్ద ఉంటూ వ్యవసాయ కూలీ పనులు వెళ్తూ.. జీవనం కొనసాగిస్తున్నాడు. ఒంటరితనం భరించలేక మద్యానికి అలవాటు పడ్డాడు. సోమవారం మధ్యాహ్నం మద్యం మత్తులో తన కూతురి ఇంటి వద్దనున్న పురుగు మందు తాగాడు. చుట్టుపక్కనున్న వారికి పురుగు మందు తాగానని చెప్పి స్పృహ కోల్పోయాడు. స్థానికులు వెంటనే ఆటోలో ఏటూరునాగారంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి కూతురు ఉషారాణికి సమాచారం అందించారు. వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో.. ఏటూరునాగారం సామాజికాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ.. మృతి చెందాడు. మృతుడి కుమారుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మేడారంలో క్షుద్రపూజలు

మేడారం(తాడ్వాయి), న్యూస్‌టుడే: వనదేవతలు సమ్మక్క, సారలమ్మ సన్నిధి మేడారంలో గత కొంతకాలంగా క్షుద్రపూజలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. మానసిక, దీర్ఘకాలిక శారీరక, కుటుంబ సమస్యలతో బాధపడుతున్న వారిని వలవేసి ఈ ముగ్గులోకి లాగుతున్నట్లు సమాచారం. హైదరాబాదు, నల్గొండ, వరంగల్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన మాంత్రికులు అమాయక భక్తులను మేడారం తీసుకొచ్చి నిర్మానుష్య ప్రాంతంలో క్షుద్ర పూజలు చేసి రూ.లక్షలు కాజేస్తున్నట్లు తెలిసింది. ఈ మాంత్రికులు మంగళ, ఆదివారాల్లో ఇలాంటి తతంగాలు నిర్వహిస్తున్నారు. గతంలో రెండుసార్లు ఇలాంటి పూజలు నిర్వహించి అమాయకులను హత్య చేసేందుకు ప్రయత్నాలు కూడా జరిగాయి. బాధితులు త్రుటిలో తప్పించుకొని పోలీసులను ఆశ్రయించగా, కేసులు నమోదై నిందితులను జైలుకు పంపిన సందర్భాలున్నాయి. జిల్లా యంత్రాంగం స్పందించి క్షుద్ర పూజలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ



చల్లగరిగెలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

చిట్యాల, న్యూస్‌టుడే: గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను నియంత్రించడం సులువు అవుతుందని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు అన్నారు. చిట్యాల మండలం చల్లగరిగెలో గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. గ్రామాల్లో ఏదైనా ఘటన జరిగినప్పుడు నిందితులను సులభంగా గుర్తించేందుకు వీలవుతుందని చెప్పారు. కార్యక్రమంలో సీఐ మల్లేశ్, ఎస్సై శ్రావణ్‌కుమార్, శిక్షణ ఎస్సైలు మహేశ్, రాజశేఖర్, సిబ్బంది నవీన్, సందీప్, నాగరాజు, నాయకులు అశోక్‌రెడ్డి, నాగరాజు, సుధాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి



గాంధీనగర్ గ్రామ సమీపంలో ఎండిపోయిన వరి పైరును పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, భారాస మండలాధ్యక్షుడు నర్సింహనాయక్, శ్రేణులు

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: మండలంలోని మొద్దులగూడెం, గాంధీనగర్ గ్రామాల్లో సుమారు వంద ఎకరాల వరి పంటకు నీరందక ఎండిపోయిందని మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎండిపోయిన పంట పొలాలను మంగళవారం భారాస మండలశాఖ అధ్యక్షుడు లాకావత్ నర్సింహనాయక్ ఆధ్వర్యంలోని పలువురు నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. లక్నవరం జలాశయం కింద వర్షాకాలం పంటలు ఎండిపోవడం చరిత్రలో ఇదే ప్రప్రథమం అన్నారు. జలాశయంలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ. . వాటిని పంటలకు చేర్చలేకపోవడం అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి శ్రీరాంపతి కాల్వకు పడిన గండ్లు పూడ్చి పూడిక తొలగించి నీరు అందించాలని, లేదంటే మరి కొంతమేర పొలాలు ఎండిపోయే ప్రమాదముందన్నారు. ఇప్పటికే ఒక్కో ఎకరానికి రూ.25 వేలకు పైగా పెట్టుబడి పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ఒక్కో ఎకరానికి ప్రభుత్వం రూ.50 వేలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భారాస నాయకులు ఎల్.రాంచందర్, ఎల్.చందూలాల్, టి.శ్రీనివాసాచారి, ఎ.సురేశ్, సీహెచ్.గట్టయ్య, బి.మంగ్యానాయక్, బి.సంతోశ్, టి.హరిసింగ్, ఆర్.రవీందర్, బి.రాజేశ్వరీ, ఎల్.బాలు, పి.వీరయ్య, ఎం.రఘు, బి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి



గోవిందరావుపేట, న్యూస్‌టుడే: గోవిందరావుపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి తీగల ఆగిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు, శ్రీరాంపతి కాల్వ ఆయకట్టు రైతులు కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఖరిని, నీటిపారుదలశాఖ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ.. పెద్దపెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. లక్నవరం జలాశయం కింద సాగు నీరు లేక పంటలు ఎండిపోవడమనే విషయాన్ని ఎవరూ జీర్ణించుకోలేరని చెప్పారు. రాష్ట్రం మొత్తం కరవు తాండవించిన సమయంలోనూ లక్నవరం జలాశయం కింద పంటలు ఎండిపోలేదన్నారు. శ్రీరాంపతి కాల్వ కింద చివరి ఆయకట్టుకు నీరు అందక పంట పొలాలు ఎండిపోయే ప్రమాదముందని, ముందు నుంచి అధికారులకు ఆయకట్టు రైతులతో పాటు తాము కూడా తెలియజేస్తున్నా.. పట్టించుకోలేదన్నారు. కాల్వకు పడిన గండ్లను సకాలంలో పూడ్చకపోవడం.. కాల్వల్లో పూడిక తొలగించకపోవడం కారణాలతోనే నీరు అందడంలేదన్నారు. సుమారు 70 ఎకరాల్లో వరి పైరు ఎండిపోయిందని, సర్వే ఆధారంగా ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ సృజన్‌కుమార్‌కు సీపీఎం నాయకులు, రైతులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పొదిళ్ల చిట్టిబాబు, ఆయకట్టు రైతులు ఆర్.రవీందర్, ఎం.సారయ్య, బి.మంగ్యానాయక్, వీరన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

మల్హర్, న్యూస్‌టుడే : ప్రజల ఆరోగ్యాన్ని హరించే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కొయ్యూర్‌లో మంగళవారం రాత్రి నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. అనుమతి పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమన్నారు. సెల్‌ఫోన్లకు అనుమానిత సందేశాలు వస్తే తెరిచిచూడవద్దని తెలిపారు. నాటుసారా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ నాగార్జునరావు, ఎస్సై నరేష్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

భూపాలపల్లి రూరల్, న్యూస్‌టుడే : బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని భూపాలపల్లి జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య అన్నారు. మంగళవారం భూపాలపల్లి మున్సిపాలిటీ సుభాష్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీడబ్ల్యూవో మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పదని, మహిళలు నేడు పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. ఇద్దరు ఆడపిల్లలున్న తల్లిదండ్రులు సుకన్య సమృద్ధి యోజనను వినియోగించుకోవాలని కోరారు. 18 ఏళ్లలోపు ఆడపిల్లలకు ఏవైనా సమస్యలు వస్తే 1098 నెంబరును ఉపయోగించుకోవాలని చెప్పారు. మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ అనూష, సూపర్‌వైజర్ అరుణ, చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'



ప్రదర్శనలో ఎన్డీ నేతలు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మండల వెంకన్న, జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్య భవన్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి పది నెలలు దాటినా .. ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ప్రజాపాలన పేరుతో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని ఇప్పటి వరకు పరిష్కరించక పోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి హలావత్ లింగన్న, నాయకులు పాల్గొన్నారు.

'ముదిరాజ్‌లు పేర్లు నమోదు చేసుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న బండా ప్రకాష్

మరిపెడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన మొదలు పెట్టినందున రాష్ట్రంలోని ముదిరాజ్‌లు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ అన్నారు. మంగళవారం మరిపెడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ గణన చేయడం శుభ పరిణామమని, దీనిని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. జనాభాకు అనుగుణంగా పదవులు లేక అట్టడుగు వర్గాలు వెనుకకు పోకుండా వెనకబడిన వర్గాలకు బీసీ కులగణన ఉపయోగపడుతుందని తెలిపారు. జనాభాకు అనుగుణంగా పదవులు రాక ముదిరాజ్‌లు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా సేకరణలో అన్ని జిల్లాల అధ్యక్షులు, మండలాధ్యక్షులు పాల్గొని ముదిరాజ్‌ల్లో చైతన్యం తీసుకురావాలన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



ములుగు, న్యూస్‌టుడే: ములుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాలరక్ష, జిల్లా విద్యాశాఖ సమన్వయంతో సమకూర్చిన గ్రంథాలయ పుస్తకాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వినోద్ మాట్లాడుతూ.. అన్ని తరగతుల విద్యార్థులకు ఉపయోగపడేలా పుస్తకాలు సమకూర్చినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. బాల రక్ష ప్రతినిధి తేజావత్ రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17న గాయకుల ఎంపిక

బాలసముద్రం, న్యూస్‌టుడే : హనుమకొండ కేయూసీ బైపాస్ రోడ్డులోని శారద వేడుకల మందిరంలో ఈ నెల 17న గాయకుల ఎంపిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కవి, గాయకుడు వరంగల్ శ్రీనివాస్ తెలిపారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పల్లె చరిత్ర, మానవీయ జీవనశైలి గురించి చాటిచెప్పే విధంగా యాస, భాషతో కూడిన విలువైన సాహిత్యాన్ని భావితరాలకు అందించడం కోసం 'నూరేండ్ల నాఊరు' అనే గేయ కావ్యాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు. 243 చరణాలతో రచించి 243 మందితో పాడించాలనే ఉద్దేశంతో తెలుగు రాష్ట్రాల్లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఎంపికలకు హాజరు కావాలని కోరారు. సమావేశంలో గిద్దె రాంనర్సయ్య, జూపాక శివ, గౌరారపు యుగేందర్, మునికుంట్ల ఐలేష్, తాళ్ల సునీల్, గట్టగల్ల సంజీవ, గూడూరు మహేష్ పాల్గొన్నారు.

నేడు కాళేశ్వరంలో కౌముది పూజ

కాళేశ్వరం, న్యూస్‌టుడే : కొజగిరి పౌర్ణమి పురస్కరించుకొని బుధవారం రాత్రి కాళేశ్వరాలయంలో కౌముది పూజ నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మారుతి తెలిపారు. రాత్రి సమయంలో ప్రత్యేక తాంబూలంలో ఏర్పాటు చేసిన క్షీరానికి అర్చకులు విశేష పూజలు నిర్వహించి, పాలల్లో చంద్రుని ప్రతిబింబాన్ని భక్తులు తిలకించేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

19న వేలం

రేగొండ, న్యూస్‌టుడే : తిర్మలగిరి గ్రామంలో ఈ నెల 19న బుగులోని వేంకటేశ్వరస్వామి జాతరకు సంబంధించి వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఈవో మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 14 నుంచి 18 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. జాతరలో భక్తులు విక్రయించే లడ్డూ ప్రసాదం, కొబ్బరికాయలు, పుట్నాలు, వంటి వాటికి వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి

మంగపేట, న్యూస్‌టుడే: ముత్యాలమ్మ తల్లి ఆలయంలోని అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని శివశక్తుల సంఘం మండల అధ్యక్షుడు మానుపెల్లి వేణు అన్నారు. మంగళవారం మంగపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్‌లోని కుమ్మరిగూడ ప్రాంతంలో ముత్యాలమ్మతల్లి ఆలయంపై దాడి చేసి అమ్మవారి విగ్రహాన్ని కొంతమంది దుండగులు ధ్వంసం చేశారని, ఈ ఘటనకు పాల్పడిన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు. డిమాండ్ చేశారు..